ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 15 ఏప్రిల్ 2025 | 5


కాకినాడ ఇంద్రపాలెం వంతెన కూడలి సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ పేరాబత్తుల, సిటీ ఎమ్మెల్యే వనమాడి

అంబేడ్కర్ పోరాటాలు నిరంతర స్ఫూర్తి

- కలెక్టర్ షాన్‌మోహన్
- జిల్లావ్యాప్తంగా జయంతి వేడుకలు

కాకినాడ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాల్యంనుంచి చేసిన పోరాటాలు,ఎదుర్కొన్న కష్టాలు నిరంతరం స్ఫూర్తిని నింపుతాయని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. కాకినాడ ఇంద్రపాలెం వంతెన కూడలి సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తులరాజశేఖర్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, వివిధశాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లావ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాజులూరులో జరిగిన వేడుకల్లో మంత్రి సుభాష్, ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూకేలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాద్, అధికారులు


జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

మామిడి.. నేలబడి..


ఈదురుగాలుల బీభత్సానికి ధర్మవరంలో నేలరాలిన మామిడి





- రారాజు మామిడికి గడ్డురోజు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో అకాల వర్షాలతో తీవ్ర నష్టం
- తీవ్ర ఈదురుగాలులతో భారీగా రాలిపోయిన మామిడికాయలు
- ఈదురుగాలులకు 16 వేల ఎకరాల్లో నష్టం.. రైతులు లబోదిబో
- ఉమ్మడి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడితోటలు.. ఒక్క కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో సాగు
- ఉమ్మడి జిల్లా నుంచి ఏటా రెండు లక్షల మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చూడగానే నోరూరించే మామిడి పండ్లు ఈ సీజన్‌లో కొనడం కష్టంగానే కనిపిస్తోంది.. అకాల వర్షాలు, వడగండ్లు... ఈదురుగాలులుతో కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లాలో మామిడికి తీవ్రంగా నష్టం వాటిల్లింది.. ఎక్కడికక్కడ చెట్ల నుంచి కాయలు భారీగా నేలరాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.. మరో రెండు వారాల్లో కాయలు పక్వానికి వచ్చే దశలో ఉండగా, అకాల వర్షాలు విరుచుకుపడడంతో కాయలన్నీ ఎందుకు పనికిరాకుండా పోయిన పరిస్థితితో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో మంచి లాభాలు వస్తాయని రైతులు అంచనా వేసుకున్నారు. అటు వ్యాపారులు సైతం లక్షల్లో అడ్వాన్సులు ఇవ్వడంతో రైతులు పెట్టుబడి భారీగా పెట్టారు. తీరా అకాలవర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 వేల ఎకరాల్లో తోటల్లో నేలరాలిన కాయలకు ఇప్పుడు ధరలు కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతుండగా, ఒక్క కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో ఉన్నాయి. ఏటా రెండు లక్షల మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి జరుగుతుండగా, ఈ దఫా సగానికి పైగా దిగుబడి పడిపోయే ప్రమాదం ఉంది.

మామిడీలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెలలోనే పలుసార్లు అనేక మండలాల్లో తీవ్రంగా ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు కురిశాయి. దీంతో చెట్లకు ఉన్న యాభై శాతానికిపైగా కాయలు రాలిపోయాయి. కాస్తోకూస్తో మిగిలిన కాయల నాణ్యత సైతం దెబ్బతినడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పక్వానికి ముందే రాలిపోయిన మామిడి మార్కెట్లకు వచ్చినా కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపించడం లేదు. అటు తాండ్ర తయారీదారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మామిడి పూత నూరుశాతం వచ్చింది. కాయలు సైతం 70శాతానికిపైగా నిలబడ్డాయి. ఫలితంగా భారీగా మార్కెట్ ఉంటుందని రైతులు భావించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కాయలు చూసి లక్షల్లో రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. దీంతో లాభాలొస్తాయన్న అంచనాలతో రైతులు సైతం పెట్టుబడులు భారీగా పెట్టారు. ప్రధానంగా ఈసారి బంగినపల్లి టన్ను రూ.60 వేలు, కొత్తపల్లి కొబ్బరి టన్ను రూ.90 వేలు, పండూరు మామిడి టన్ను రూ.65 వేల వరకు ధర వెళ్తుందని రైతులు భావించారు. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో సాగవుతోంది. ఏటా ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకు మామిడి దిగుబడి అవుతుంది. ఇందులో 600 టన్నుల వరకు ఒక్క దక్షిణ కొరియాకే ఎగుమతి అవుతాయి. ఇందులో ఎక్కువగా కాకినాడ జిల్లా నుంచి అధిక ఎగుమతులు జరుగుతాయి. అత్యధిక సాగు కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం, గొల్లప్రోలు, తుని, తొండంగి, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో తోటలున్నాయి. అటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం, మండపేట, ఆలమూరు తదితర ప్రాంతాల్లో వివిధ రకాల మామిడి తోటలున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం తదితర మండలాల్లో రైతులు వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అయితే తాజాగా కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఉమ్మడి జిల్లాలో 16 వేల ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా. అయితే మరో రెండు వారాల్లో చెట్ల నుంచి కాయలు దించడానికి అంతా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో అకాల వర్షాలతో రైతుల ఆశలన్నీ ఆవిరయ్యాయి. ప్రధానంగా ఈవారంలో మూడుసార్లు కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులు, వడగండ్ల వానతో నష్టం మరింత పెరిగింది. పదిరోజుల వ్యవధిలో కాయలు కోసి మార్కెట్‌కు పంపడం తరువాయి అనే దశలో వీచిన పెనుగాలుల ప్రభావంతో మామిడితోటల్లో కాయలన్నీ నేలరాలిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడ మామిడి తోటలు చూసినా రాలిపోయిన మామిడికాయలు గుట్టలు, గుట్టలుగా కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏప్రిల్ చివరి వారం నుంచి మార్కెట్‌కు నాణ్యత కలిగిన మామిడి రాక ప్రారంభమవుతుంది. అంతకంటే ముందుగానే మామిడి వచ్చినా వాటి నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటుంది. ఈ ఏడాది మామిడి మార్కెట్ ఆశాజనకంగా ఉండడం, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి ఆర్డర్లు ఉన్న నేపథ్యంలో తమ పంట పండుతుందని రైతులు ఆశించారు. అయితే ఈదురుగాలులకు ఎక్కడిక్కడ మామిడికాయలు రాలిపోవడంతో వారు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మామిడితోటల్లో రాలిన మామిడిని ఏరి గుట్టలుగా పోయడంలో రైతులు నిమగ్నమయ్యారు. రాలిన మామిడికి ఏరివేత కూలి వస్తే అదే చాలని చెబుతున్నారు. మరోవైపు చెట్లకు మిగిలి ఉన్న మామిడి నాణ్యత సైతం దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

కాయరాలితే నష్టం చెల్లింపు నిల్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మామిడి, జీడిమామిడి వంటి పండ్లకు సంబంధించి ఈదురుగాలుల వల్ల కాయలు రాలిపోతాయి. చెట్ల కొమ్మలు విరిగిపోతుంటాయి. కానీ ప్రభుత్వ నిబంధన ప్రకారం ఏకంగా చెట్టు నేల కూలి తేనే పరిహారం ఇస్తారు. ఎన్నికాయలు రాలిపోయినా, చెట్టు కొమ్మలు విరిగిపోయినా పరిహారం రాదు. నిజానికి లక్షల్లో కౌలు చెల్లించి మామిడి తోటలు రైతులు తీసుకుంటారు. కాయలు రాలిపోతే మొత్తం నష్టపోతారు.

అకాల వర్షం.. అపార నష్టం

నేలకూలిన అరటి, బొప్పాయి, మునగ


గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఈదురుగాలులకు నేలనంటిన అరటిచెట్లు, బొప్పాయి, మునగచెట్లు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, వర్షాలకు అరటి, బొప్పాయి, మునగ తోటలతో పాటు కాయగూరల పంటలకు అపారనష్టం వాటిల్లింది. గొల్లప్రోలు మండలం చెందుర్తి, దుర్గాడ, తాటిపర్తి, పిఠాపురం మండలం విరవాడ, కందరాడ గ్రామాల్లో 300 ఎకరాల్లోని అరటి చెట్లు నేలకూలాయి. గెలలు కాసి మరో 20-30రోజుల్లో పంట చేతికందుతుందని భావిస్తున్న తరుణంలో గాలులు తాకిడి చెట్లు దెబ్బతినడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. గొల్లప్రోలు మండలంలో బొప్పాయి, మునగ చెట్లు దెబ్బతిన్నాయి. నేలనంటాయి. కాయగూర పంటలు, దొండ తదితర పందిరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పందిర్లు పడిపోవడంతో నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

ధాన్యం తరలించేందుకు అగచాట్లు

పిఠాపురం/గొల్లప్రోలు,ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురుగాలుల ప్రభావానికి దాళ్వా వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గాలులు తాకిడికి ఏలేరు, పీబీసీ ఆయకట్టులో 25వేలఎకరాల్లో వరి పంట నేలనంటింది. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల పరిధిలో వరి కంకులు నీటిలో నానుతున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్‌రోడ్లు, ఆర్‌అండ్‌బీ రహదారులు, పిఠాపురం-ఉప్పాడ, పిఠాపురం-సామర్లకోట, చేబ్రోలు-మల్లవరం రహదారులపై ఉండిపోయిన ధాన్యం రాశులు వర్షపునీట తడిచాయి. పలుచోట్ల వీటిపై కప్పిన టార్పాలిన్లు, బరఖాలు గాలికి ఎగిరిపోయాయి. దీనితో రైతులు రహదారులు, పొలాల్లో ఉండిపోయిన ధాన్యం రాశులను బస్తాల్లోకి పట్టి ట్రాక్టర్లు, వేన్లు, ఎడ్లబండ్లపై మిల్లులకు తరలించారు.


పిఠాపురంలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లుకు పంపేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

ఈదురుగాలులకు విరిగిన కరెంటు స్తంభాలు, చెట్లు

కొత్తపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో ఆదివారం రాత్రి ఈదురు గాలుల బీభత్సానికి వివిధ గ్రామాల్లో 9 కరెంటు స్తంభాలు నేలకూలాయి. కొత్తపల్లి ధర్మాశాస్తా ఆలయం సమీపంలో కరెంటు తీగలపై చెట్టు విరిగి పడింది. ఆదివారం రాత్రంతా కొత్తపల్లి మండలం అంధకారంలోఉంది. సోమవారం ఉదయం 10గంటలకు కరెంటు పునరుద్ధరించారు. పలు గ్రామాల్లో దాళ్వా వరిచేలు ఈదురుగాలులకు నేలనంటడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొండెవరం, కొత్తపల్లి, నాగులాపల్లిల్లో మామిడికాయలు రాలాయి.


కొత్తపల్లిలో కరెంటు తీగలపై విరిగిపడిన చెట్టు

విపత్తుల సమయంలో..

అగ్నిమాపక శాఖ సేవలు కీలకం

కలెక్టర్ షాన్‌మోహన్, అగ్నిమాపకశాఖ వారోత్సవాలు ప్రారంభం


జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించిన అనంతరం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కాకినాడ క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో అగ్నిమాపక శాఖ సేవలు కీలకమని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి కొనియాడారు. సోమవారం అగ్నిమాపకశాఖ వారోత్సవాలను కాకినాడ రామారావుపేటలోని జిల్లా అగ్నిమాపక కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. తొలుత అమరులైన సిబ్బంది స్తూపానికి ఘన నివాళులర్పించారు. అనంతరం అగ్ని ప్రమాద నివారణకు సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ప్రజలందరు అవగాహన కల్పించుకుని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం, భవన నిర్మాణంలో ఫైర్ సేఫ్టీ పాటించడం, గృహాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దేశ వ్యాప్తంగా గత సంవత్సర కాలంలో అగ్నిమాపక శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో అమరులైన సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం కాకినాడ ఏడిఎఫ్ఓ వి.సుబ్బారావు గత సంవత్సరం తమ శాఖ కార్యకలాపాలను, సిబ్బంది నిర్వహించిన బృహత్ కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా అగ్రిమాపక కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ ఆధునాతన అగ్నిమాపక పరికరాలు, రెస్క్యూ పరికరాల పని తీరును వివరించే ప్రదర్శనను తిలకించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 20 వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతాయని.. పాఠశాలలు, కళాశాలలు, అపార్ట్‌మెంట్‌లు, వివిధ వాణిజ్య సముదాయాలు, హాస్పటల్స్, వివిధ పరిశ్రమలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడిఎఫ్ఓ బి.ఏసుబాబు, సూపరింటెండెంట్ వినాయక, జగన్నాథపురం, సాలిపేట అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలపై క'రుణ'

జిల్లాలోని ఎస్సీ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకం కింద రుణాలు పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం నుంచి ఆన్‌లైన్ పక్రియ ప్రారంభమైంది. మే 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి తెలిపారు.

- ఆ సామాజిక వర్గానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం
- మే 10 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- 798 యూనిట్లకు రూ.33.18కోట్లు మంజూరు

(కాకినాడ/కార్పొరేషన్(కాకినాడ), ఆంధ్రజ్యోతి):

ఎస్సీల సంక్షేమానికి, వారికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే బీసీ రుణాల జాతర మొదలుకాగా.. ఎస్సీ రుణాలను అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సామాజికవర్గంలో ఓ ఆర్థిక భరోసా నింపే ప్రయత్నం ప్రారంభించింది. ఈ సబ్సిడీ రుణాలతో యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. దాదాపుగా ఐదేళ్ల తర్వాత మళ్లీ ఆ సామాజిక వర్గీయులకు మంచి రోజులు తీసుకొచ్చింది. మే 10వతేదీతో ఇది ముగుస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. రూ.2.50లక్షల నుంచి రూ.20లక్షల విలువైన 20 రకాల వివిధ స్వయం ఉపాధి పథకాలకు రుణాలు అందించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యం కావడంతో ఎస్సీ యువత లబ్ధి పొందలేకపోయారు. రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం నోటిఫికేషన్ ఇవ్వడంతో ఎస్సీ యువతీ యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 4లక్షల వరకు ఎస్సీ సామాజిక వర్గీయులు ఉన్నారు. వీరికి 2015 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, బ్యాంకు లింకేజీ అంటూ ఇలా మొత్తం 20వేల మంది వరకు యూనిట్ల ఏర్పాటుకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందజేసి సహకరించింది. దీంతో చాలా మంది యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికపరిపుష్టి సాధించారు. ఈసారీ కూటమి సర్కారు అదేరీతిని ఎస్సీలకు వెన్నుదన్నుగా నిలవనుంది. ఇందులో మెడికల్ షాపు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రిక్ ఆటో, ఎలక్ట్రిక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, పాసింజర్ కార్(ఫోర్ వీలర్), గూడ్స్, ట్రక్ యూనిట్ల ద్వారా అవకాశం కల్పించనుంది.

కాకినాడలో 798 యూనిట్లు

కాకినాడజిల్లాకు సంబంధించి మొత్తం యూనిట్లు 798 కాగా, వాటి విలువ రూ.3318.25లక్షలు, ఇందులో సబ్సిడీ రూ.1310.10లక్షలు, బ్యాంకు రుణం రూ.1842.24లక్షలు, లబ్ధిదారుని వాటా రూ.165.91 లక్షలుగా నిర్దేశించారు. ఔత్సాహికులు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా మే 10వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 798 యూనిట్లకుగాను రూ.33.18కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు తగిన ప్రణాళికలు సిద్ధ చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు 60శాతం సబ్సిడీ, 35శాతం బ్యాంకింగ్, 5శాతం బెనిఫిసరీ కాంట్రిబ్యూషన్ ఉంటుందన్నారు. మొత్తం 26 రకాల యూనిట్లకు ఇక్కడ రుణాలు మంజూరు చేయనున్నారు. రూ.3లక్షలు పైబడి రుణాలకు 40శాతం నుంచి 55శాతం బ్యాంక్ లోను, 5శాతం బెనిఫిషరీ కంట్రిబ్యూషన్ ఉంటుందనారు. 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలలోపు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్, ఆధార్‌కార్డు, సాంకేతిక విద్యార్హత జతపరిచి పట్టణానికి చెందిన అభ్యర్థులు ఆయా మున్సిపాల్టీల్లో కమిషనర్లకు, మండలాల అభ్యర్థులు ఎంపీడీవోకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటికి సంబంధించి జిరాక్స్ పత్రాలు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సత్యవతి పేర్కొన్నారు. అభ్యర్థులు గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈకేవైసీ.. పూర్తయ్యేనా?

- రేషన్‌కార్డుల్లో సభ్యుల వివరాల నమోదుకు ఈ నెలాఖరుతో గడువు పూర్తి
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్ష్యం 49లక్షల34వేలు
- ఇప్పటివరకు 45లక్షల24వేల మందికి పూర్తయిన నమోదు
- ఇంకా నమోదు కావాల్సినవారు 3లక్షల 23వేలమంది

7

గోదావరిలో ఇద్దరు యువకుల గల్లంతు

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు

7

ఒక్కసారి లే కన్నా...

తల్లడిల్లిన తల్లి

మోటారుసైకిల్ అదుపుతప్పి ఆటో ఢీకొని కుమారుడి మృతి

7

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగెనే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హారిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసెనే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్‌ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్‌ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న జడ్జి మల్లికార్జునరావు దంపతులు

ద్రాక్షారామ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ, అన్నవరంలోని పలు ఆలయాల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సోమవారం పూజలు నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని భీమేశ్వరాలయాన్ని సోమవారం హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ముందుగా ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు.

సత్యదేవుడి సన్నిధిలో..

అన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.



సత్యదేవుడి దర్శనానంతరం జడ్జి వెంకట జ్యోతిర్మయి

ఇంటిల్లపాదికి ఆనందాన్ని పంచే..
అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి

సినీ హీరో ప్రదీప్ మాచిరాజు



అభిమానులతో మాట్లాడుతున్న హీరో ప్రదీప్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి చిత్రం వేసవి సెలవుల్లో ఇంటిల్లపాదికి ఆనందాన్ని పంచుతుందని సినీ హీరో మాచిరాజు ప్రదీప్ పేర్కొన్నారు. తాను పుట్టిన ఊరులోనే ప్రేక్షకులతో కలిసి సినిమా చూడడం కొత్త అనుభూతిని ఇచ్చిందన్నారు. అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి చిత్రం ప్రదర్శిస్తున్న అమలాపురం శేఖర్ థియేటర్‌కు హీరో హీరోయిన్లు ప్రదీప్, దీపిక పిల్లి, దర్శకద్వయం నితిన్, భరత్‌ల బృందం సోమవారం రాత్రి వచ్చారు. ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. తాను అమలాపురంలోనే పుట్టానని, ఇదే థియేటర్‌లో ఎందరో హీరోల సినిమాలను చూశానన్నారు. సినిమాను ఆదరించిన ప్రేకక్షకులకు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు హైదరాబాద్ నుంచి వచ్చానని ప్రదీప్ మాచిరాజు చెప్పారు. కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఈ చిత్రం ద్వారా మరోసారి రుజువు చేసినట్టు హీరోయిన్ దీపిక పేర్కొన్నారు.

నా ఆస్తి అమ్మైనా పేదరికాన్ని నిర్మూలిస్తా

అంబేడ్కర్ జయంతి సభలో కార్మిక శాఖ మంత్రి సుభాష్



కరప, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తన ఆస్తిని అమ్మైనా పేదరికాన్ని నిర్మూలిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలంలో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. దీంతో అక్కడున్న నాయకులు చప్పట్లతో హర్షధ్వానాలు పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్ కలను నెరవేర్చడానికి తన ఆస్తి అమ్మైనా రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక్క పూరిగుడిసె లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఇంటర్ సీఈసీలో లీలాశ్రావణికి
రాష్ట్రంలో ప్రథమం

నేడు సత్కరించనున్న మంత్రి లోకేశ్



ఆర్.లీలాశ్రావణి

బిక్కవోలు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పందలపాక జడ్పీ హెచ్ఎస్ ప్లస్‌లో చదివిన ఆర్.లీలాశ్రావణి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఆమె సీఈసీ గ్రూపులో 943 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. దీంతో పాటు ఆమె రాష్ట్రస్థాయిలో కూడా టాపర్‌గా నిలిచిందని పాఠశాల ఇంటర్ విద్యాశాఖ నుంచి మెసేజ్ వచ్చిందని ఆయన తెలిపారు. ఈమెను మంగళవారం అమరావతిలో జరిగే కార్యక్రమంలో విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ సత్కరించనున్నారని హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఏపీఎస్పీ
రేంజ్-1 స్పోర్ట్స్ మీట్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో ఏపీఎస్పీ రేంజ్-1 గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమాండెంట్ ఎం.నాగేంద్రరావు తెలిపారు. మంగళవారం ఉదయం 7.30గంటలకు ప్రారంభమవుతాయని ఈ క్రీడోత్సవంలో 4 బెటాలియన్లకు చెందిన సుమారు 300మంది పోలీస్ క్రీడాకారులు 29ఈవెంట్లలో పాల్గొంటారన్నారు. పోటీల ముగింపుకార్యక్రమంలో బెటాలియన్స్ ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ కె.ఫకీరప్ప ముఖ్య, గౌరవఅతిధులుగా హాజరుకానున్నారని తెలిపారు.

ఎస్ఏ సీనియార్టీ జాబితాపై
అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్టీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)ల పదోన్నతి, అదే విధంగా ఎస్ఏ నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి సంబంధించిన సీనియార్టీ జాబితాలను రూపొందించామని కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ జాబితాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ డీఈఓ.ఈస్ట్‌గోదావరి.బ్లాగ్‌స్పాట్ వెబ్‌సైట్, నోటీస్ బోర్డులలో మంగళవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. సంబంధిత జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 17 సాయంత్రం 5గంటలలోపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈవో సూచించారు.

ఫ్రమ్ ది ఎర్త్.. టూ ది స్కైస్ పుస్తకావిష్కరణ



కాకినాడ కలెక్టరేట్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన విశాంత్ర ఉపాధ్యాయిని ఈశ్వరమ్మ జీవిత చరిత్ర ఫ్రమ్ ఎర్త్ టూ స్కై.. పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగింది. దీనికి రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, రాష్ట్ర అకౌంటెంట్ ఆడిటర్ జనరల్ శాంతిప్రియ, ఈశ్వరమ్మ కుమారుడు మేఘాలయ రాష్ట్రానికి చెందిన సీనియర్ కలెక్టర్ సంపత్‌కుమార్, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, అమలాపురం మాజీ ఎంపీ బుచ్చి మహేశ్వరరావు, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ దగ్గర విద్యనభ్యసించిన విద్యార్థులు ఆమెను ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ జయంతి రోజున ఈశ్వరమ్మ వంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం గొప్ప శుభపరిణామన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులు మంగాకుమారి, ప్రకాష్, జమీమా, ప్రముఖ పారిశ్రామికవేత్త సత్యశ్రీ శాస్త్రి, మంజు తదితరులు పాల్గొన్నారు.

నేల నుంచి నింగికి..
ఇది ఓ విశ్రాంత ఉపాధ్యాయిని జీవిత గాథ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తన జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లు.. ఓ పక్క ఉద్యోగ ధర్మాన్ని.. కుటుంబ భారాన్ని మోస్తూ.. తన పిల్లలను ఎలా వృద్ధిలోకి తీసుకొచ్చింది.. ఉపాధ్యాయురాలిగా ఆమె అనుభవాలు.. నేర్చుకున్న, నేర్పిన పాఠాలు.. జీవితంలో తాను ఓ స్థాయికి రావడానికి తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం.. రవాణా సౌకర్యాలు లేని సమయంలో కిలోమీటర్లు కొద్ది కాలినడకన నడిచిన రోజులు.. వసతి గృహాల్లో వందలాది మంది విద్యార్థుల మధ్య గడిపిన క్షణాలు.. ఇలా అనేక విశేషాలను వివరిస్తూ.. కాకినాడ జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ఈశ్వరమ్మ రాసిన ఆత్మకథే.. ఫ్రం ది ఎర్త్.. టు ది స్కైస్ (నేల నుంచి నింగికి..).. తాను జీవితంలో ఉన్నత స్థానంలో నిలవడమే కాదు.. తన నలుగురి సంతానాన్ని ప్రయోజకులుగా చేశారు ఆమె. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పత్తిగొంది గ్రామంలో చక్రం, ఆదెమ్మ దంపతులకు 1944 ఆగస్టు 18న జన్మించిన ఈశ్వరమ్మ.. కాకినాడలో ఎస్ఎల్‌సీసీ పూర్తి చేశారు. 1959లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అదే సమయంలో ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు నలుగురు కుమారులు. అందులో మూడో తనయుడు సంపత్‌కుమార్ సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుతం మేఘాలయ రాష్ట్రంలో హెల్త్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. కోడలు సత్యశ్రీ పారిశ్రామిక వేత్త, నాలుగో కుమారుడు ఈశ్వరశాస్త్రి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉద్యోగి, కోడలు జిల్లా మార్క్‌ఫెడ్ ఏడీ కావడం విశేషం.

అయ్యప్ప సన్నిధిలో విషు పండుగ



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

శంఖవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేరళ నూతన సంవత్సర వేడుకైన విషు పండగను ఆంధ్రా శబరిమలై సన్నిదానంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కూసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో వేకువజాము నుంచి పలు విశేషకరమైన హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను ఊరేగించారు. పదునెట్టాంబడిపై స్వామివారిని తీసుకుని వచ్చి చక్రస్నానమాచరింపజేశారు. స్వామివారికి ముత్యాలతో అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనాలు అందజేసారు. భారీస్థాయిలో హాజరైన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

పుదుచ్చేరి రాజ్‌నివాస్‌కు బాంబు బెదిరింపు

అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

యానాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ నివాసం, కార్యాలయం (రాజ్‌నివాస్)కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. సోమవారం గవర్నర్ కైలాసనాథన్ పలు ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యారు. దీంతో గవర్నర్ సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పెరియాకడై పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో బాంబ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి బాంబు లేదని తేల్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈఫేక్ కాల్‌గా భావించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. గతంలో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తే ఇప్పుడు బెదిరింపులకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై
దశలవారీ పోరాటం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై దశలవారీ పోరాటం సాగిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సోమవారం రాజకీయ ప్రచార జాత ముగింపు సభ నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సభలో అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రతి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు రాజకీయ సైద్ధాంతిక అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. కేంద్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఈకే.. నాట్ ఓకే!

- ఉమ్మడి 'తూర్పు'లో నత్తనడకన ఈకేవైసీ నమోదు క్రతువు
- ఈ నెలాఖరుతో గడువు పూర్తి
- ఇప్పటివరకు 45.24 లక్షల మందికి పూర్తి
- ఇంకా నమోదు కావాల్సినవారు 3లక్షల 23వేలమంది
- సహకరించని సచివాలయాల సిబ్బంది, రేషన్‌డీలర్లు



కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యుల వివరాలను ఈకేవైసీలో నమోదు చేసే క్రతువు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఇటు రేషన్‌డీలర్లు, ఎండియూ వాహనాల ఆపరేటర్లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సహకరించకపోవడంతో ఈ పోస్ ద్వారా నమోదు నెమ్మదించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో రేషన్‌కార్డుల్లో 49లక్షల34వేలమంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 45లక్షల 24వేల మంది వివరాలను ఈకేవైసీ చేశారు. ఇంకా 3 లక్షల23 వేలమంది రేషన్‌కార్డు సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. రేషన్‌షాపు డీలర్లు, ఎండియూ వాహనాల ఆపరేటర్లు, గ్రామవార్డు సచివాలయాల సిబ్బంది సహకరించకపోవడం వల్ల ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. దీనిలో ఐదేళ్లలోపు చిన్నారులు, 80ఏళ్ల దాటిన వృద్ధులకు మినహాయింపు ఇచ్చారు. వీరి సంఖ్య 86700 మంది ఉన్నారు. దీంతో వీరి వివరాలను ఈకేవైసీ చేయనవసరం లేదు. ఈకేవైసీ ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో నమోదు జరగడం లేదు. గతనెల 11 నుంచి 31 వరకు తొలివిడత ఈకేవైసీ నమోదు జరిగింది. పెద్దఎత్తున నమోదు పెండింగ్ ఉండడంతో కేంద్రప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచింది.

ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలి

ఈకేవైసీ నమోదు ప్రక్రియ వేగవంతం అయ్యేలా రేషన్‌డీలర్లు, ఎండియూ వాహనాల ఆపరేటర్లకు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది.

కాకినాడ జిల్లాలో..

జిల్లాలో 18 లక్షల 31వేలమంది రేషన్ కార్డు సభ్యుల వివరాలను ఈకేవైసీ చేయాల్సి ఉంది. వీరిలో ఇప్పటివరకు 16 లక్షల 64వేలమంది వివరాలు నమోదు చేశారు. ఇంకా లక్షా 36 వేలమంది వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఐదేళ్లలోపు చిన్నారులు, 80ఏళ్ల దాటిన వృద్ధులు 30 వేల మంది వివరాలు నమోదు చేసే అవసరంలేదు. వీరికి మినహాయింపు ఇచ్చారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

ఈ జిల్లాలో 15లక్షల77వేలమంది రేషన్ కార్డుల్లో సభ్యుల వివరాలు ఈకేవైసీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 14 లక్షల 58వేల వివరాలు నమోదు చేశారు. ఇంకా 92,620 మంది వివరాలు ఈకేవైసీ చేయాల్సి ఉంది. రేషన్‌డీలర్లు, ఎండియూ వాహనాల్లో ఆశించిన స్థాయిలో ఈ నమోదు జరగడంలేదని రేషన్‌దారులంటున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

ఈ జిల్లాలో 15లక్షల25వేలమంది రేషన్‌కార్డుల్లో సభ్యుల వివరాలను ఈకేవైసీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 14లక్షల వెయ్యిమంది వివరాలు నమోదయ్యాయి. ఇంకా 94వేలమంది వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి.

గోదావరిలో స్నానానికి దిగి
ఇద్దరు యువకుల గల్లంతు

- బయపడిన మరో యువకుడు
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి దుర్గేష్, ఆర్డీవో, డీఎస్పీ





ప్రకాష్‌కుమార్, హర్ష (ఫైల్‌ఫోటోలు)



గోదావరిలో యువకుల కోసం గాలిస్తున్న పోలీసులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

కొవ్వూరు/, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామంలోని చిగురులంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో వడి తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న ముగ్గురు యువకులైన నిడదవోలు చర్చిపేట నుంచి రత్నదీప్, మత్తి ప్రకాష్‌కుమార్ (15), రాజమహేంద్రవరానికి చెందిన గండం హర్ష (18) మద్దూరులంక వద్ద బ్యారేజ్ దిగువన స్నానానికి దిగారు. నదీ లోతుగా ఉండడంతో ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా అక్కడే ఉన్న నిడదవోలుకు చెందిన మరో ఆరుగురు యువకులు రక్షించే ప్రయత్నంచేశారు. వారిలో దివాకర్ అనే యువకుడు రత్నదీప్‌ను రక్షించాడు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జీదేవకుమార్, తహశీల్దార్ ఎ.దుర్గాప్రసాద్, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలర్లు, ఫైర్ సిబ్బందితో గోదావరిలో అర్థరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు ప్రమాదవశాత్తు నదిలో గల్లంతవ్వడం బాధాకరమన్నారు. తల్లి తండ్రులను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. గల్లంతైనవారిని వెలికితీయడానికి కాకినాడ నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను, గజఈతగాళ్లను రప్పిస్తున్నామన్నారు. సంఘటనా స్థలంలో యువకుల తల్లితండ్రులు, బంధువుల రోదనలతో నిండిపోయింది.

ఉదయమంతా చలాకీగా తిరిగి.. మధ్యాహ్నానికి మాయమై...

నిడదవోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం మద్దూరులంక వద్ద గోదావరిలో గల్లంతైన ఇద్దరిలో ఒకరు మత్తి ప్రకాష్‌కుమార్ (15) నిడదవోలు చర్చిపేటకు చెందినవాడు కావడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశాడు. సోమవారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాల అనంతరం స్నేహితులతో కలిసి మద్దూరులంకలో గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. తల్లి ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లగా, తండ్రి ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం నుంచి తమతో ఎంతో చలాకీగా తిరిగిన ప్రకాష్‌కుమార్ గోదావరిలో గల్లంతయ్యాడని తెలిసి స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఇసుక లారీ బోల్తా

డ్రైవర్ మృతి
క్లీనర్‌కు తీవ్ర గాయాలు



చెట్టును ఢీకొని బోల్తాపడిన ఇసుక లారీ

కరప, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాధగిరి ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం ఇసుక లారీ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందగా క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన రావుల శ్రీనివాసరావుకు చెందిన లారీపై రామచంద్రపురం మండలం ద్రాక్షారామ శివారు వేగాయమ్మపేటకు చెందిన పిల్లి శ్రీనివాసు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరు తరచూ కోటిపల్లి, కపిలేశ్వరపురం ర్యాంపుల నుంచి కాకినాడ తదితర ప్రాంతాలకు ఇసుక తరలిస్తుంటారు. అయితే సోమవారం క్లీనర్ రాకపోవడంతో లారీ ఓనర్ రావుల శ్రీనివాసరావు(50) డ్రైవర్ పిల్లి శ్రీనివాసుకు పక్క సీటులో కూర్చొని డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఇసుక లోడుతో జగన్నాధగిరి కెనాల్ రోడ్డుకు వచ్చేసరికి లారీ అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న భారీవృక్షాన్ని ఢీకొని బోల్తాపడింది. లారీ వేగానికి ఆ చెట్టు వేళ్లతో సహా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదధాటికి ఇసుక లారీ ముక్కముక్కలుగా విరిగిపోయింది. ఈ ప్రమాదంలో రావుల శ్రీనివాసరావు లారీ కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందగా పిల్లి శ్రీనివాసు తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు సాయంతో అతడ్ని బయటకు లాగి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.



లారీ కింద ఇరుక్కుని మృతిచెందిన శ్రీనివాసరావు



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ పిల్లి శ్రీనివాస్

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

రౌతులపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన యర్రా నాగేశ్వరరావు(38) మృతిచెందాడు. వివరాల ప్రకారం.. కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నాగేశ్వరరావు రోజులాగే సోమవారం వీవీ పట్నం శివారు పామాయిల్ తోటలోకి పనికి వెళ్లాడు. పామాయిల్ గెలలు కోసిన తరువాత ఆదే కర్రతో తాటాకు కోస్తుండగా 12 కేవీ విద్యుత్ వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇద్దరు ఆడ పిల్లలతో ఎలా బతకాలి అంటూ భార్య గన్నమ్మ కన్నీరు మున్నీరు అయ్యింది. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



అన్నవరం/గొల్లప్రోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం మల్లవరం రైల్వేగేటు సమీపంలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని రైల్వే హెచ్‌సీ శ్యామ్ తెలిపారు. మృతదేహం వద్ద ఏలాంటి ఆధారాలు లేవని, సుమారు 45 ఏళ్ల ఉంటాయని... కుడి, ఎడమ చెయ్యి వద్ద పెద్ద టాటూ ఉన్నాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు ఆదేశాలతో తుని ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులు, 9490619020కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

చీడిగలో చోరీ

23 గ్రాముల బంగారం, రూ.5వేలు నగదు అపహరణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం చీడిగలోని గుడాలవారి సత్రం రోడ్డులోగల సూరాడ నరేంద్ర ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 23 గ్రాముల బంగారం, రూ.5వేలు నగదు అపహరించినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎ.వీరబాబు తెలిపారు. నరేంద్ర పాతర్లగడ్డలోని ఆక్వా కంపెనీలో పనిచేస్తాడు. ఈ నెల 12న మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి ప్రాంతంలోని తన అత్తవారింటికి వెళ్లి సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి తాళం కప్ప బద్దలు కొట్టి తలుపులు తెరచి ఉన్నాయి. దీంతో ఉలిక్కిపడి కంగారుగా ఇంటిని పరిశీలించగా బంగారం, నగదు అపహరించినట్టు గుర్తించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొవ్వూరులో అదృశ్యం... హైదరాబాద్‌లో ప్రత్యక్షం...

అత్తింటి నుంచి వెళ్లిపోయిన మహిళ

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురం శంకరయ్యపేటకు చెందిన వీరవాసరపు యేసురత్నం వేసవి సెలవుల నిమిత్తం కొవ్వూరు అత్తగారింటికి వచ్చింది. ఈ నెల 14వ తేదీ ఉదయం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అత్త వీరవాసరపు దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, మహిళ హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించినట్టు సీఐ విశ్వం తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గండేపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారు పోలవరం గట్టుపై పేకాట ఆడుతున్నట్టువచ్చిన సమాచారం ఎస్‌ఐ యువి శివనాగబాబు, సిబ్బంది దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఒక్కసారి లే కన్నా...

తల్లడిల్లిన తల్లి
బైక్ అదుపుతప్పి ఆటోను ఢీకొని కుమారుడి మృతి



సోమేశ్వరంలో కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి నాగమణి

రాయవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మృతదేహం వద్ద తల్లి ఒక్కసారి లేకన్నా అంటూ రోదించిన తీరు కంటతడి పెట్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం శెట్టిబలిజపేట సమీప ప్రాంతానికి చెందిన దడ్డి సందీప్(16) సోమవారం గ్రామంలో తెలిసిన వ్యక్తి నుంచి బైక్ తీసుకుని మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా సోమేశ్వరం శివారు పప్పుల మిల్లుకు సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పిపోవడంతో పాటు రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని సందీప్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సందీప్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఈ సంఘటనతో సోమేశ్వరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లి నాగమణి కన్నీరుమున్నీరుగా విలపించింది. సంఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్ బాబు పరిశీలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మోటార్‌సైకిళ్లు ఢీ: యువకుడి మృతి

మరో నలుగురికి గాయాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ- కొనపాపపేట రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. అనకాపల్లి జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన ఎద్దు దుర్గాప్రసాద్(25) కెఎస్ఈజెడ్‌లో సంధ్య రొయ్యల శుద్ధి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తనతోపాటు పనిచేస్తున్న నవదీప్, నవీన్‌లతో కలిసి ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై సెజ్ నుంచి ఉప్పాడ వస్తున్నారు. ఉప్పాడ వైపు నుంచి మోటార్‌సైకిల్‌పై మరో ఇద్దరు వ్యక్తులు వేగంగా వస్తూ కొనపాపపేట వైపు వెళ్తుండగా కెఎస్ఈజెడ్ సమీపంలో పరిశ్రమలకు వెళ్లే రోడ్డులో ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా నలుగురికి గాయాలయ్యాయి. వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ జీ.వెంకటేష్ తెలిపారు.

పిడుగుపాటుకు 16 పశువుల మృతి



మేడిగట్టులో మృతిచెందిన పశువులు

ఏటపాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏటపాక మండలం నందిగామ పంచాయతీ పరిధి వలస గ్రామం మేడిగట్టులో చెట్టు కింద సేదతీరుతున్న పశువులపై ఆదివారం సాయంత్రం పిడుగుపడి ఆదివాసీ రైతులకు చెందిన 7 ఎద్దులు, 8 ఆవులు మృతిచెందాయి. స్థానిక వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి మృతిచెందిన పశువులను పరిశీలించారు. ఇదిలా ఉండగా కృష్ణవరం గ్రామంలో పిడుగుపాటుకు పద్దం కృష్ణకు చెందిన పశువు మృతి చెందింది.

కాలిన కొబ్బరిచెట్టు

అంతర్వేది, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లి లాకురుని హైస్కూలు వెనక కొబ్బరి తోటలో ఆదివారం రాత్రి ఆకాశ ఉరుములు పిడుగు పడింది. దీంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. పిడుగు పాటుకు కొబ్బరిచెట్టు కాలిపోయింది.

రమణక్కపేటలో అశ్లీల నృత్యాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో విజయజనార్దన స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు ప్రదర్శించారు. ఉత్సవాలను కూటమి నాయకుల సమక్షంలో నిర్వహించారు. భక్తి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయడం పట్ల పలువురు గ్రామస్థులు కమిటీ నాయకుల వైఖరిని దుయ్యబట్టారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోకుండా మౌనం దాల్చడం పట్ల పోలీసుల వైఖరిని పలువురు విమర్శిస్తున్నారు.

గుట్టు రట్టు!

- కలుషితాహారం తిని 28 మందికి అస్వస్థత, 3 రోజులుగా జగ్గంపేటలో చికిత్స
- విషయం బయటకు తెలియజేయని అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ యాజమాన్యం
- బాధితుల వద్దకు వెళ్లిన కాకినాడ డీఎంహెచ్‌వో, ఫ్యాక్టరీలో తనిఖీలు



అవంతి పరిశ్రమలో తాగునీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు



జగ్గంపేటలో చికిత్స పొందుతున్న బాధితులు

జగ్గంపేట/ఏలేశ్వరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్‌లో కలుషితాహారం తిని 28మంది అస్వస్థతకు గురయ్యారు. అయితే వారిని గత 3రోజుల క్రితమే జగ్గంపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అప్పటి నుంచి విషయం బయటకు పొక్కకుండా అవంతి యాజమాన్యం గుట్టుగా ఉంచింది. అయితే సోమవారం ఈ విషయం మీడియా ద్వారా బయటకు రావడంతో జగ్గంపేటలో ఆ ఆసుపత్రిని జిల్లా వైద్యశాఖాధికారి నరసింహనాయక్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సుమారు 25 నుంచి 30 మంది అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. మైనర్ పాయిజనింగ్ కావడంతో ప్రమాదం తప్పిందని, ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదన్నారు. 15 మంది డిశ్చార్జి కాగా ప్రస్తుతం ఆసుపత్రిలో 12 మంది ప్రాథమిక చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారి పరిస్థితి నిలకడగానే ఉందని ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. వారిని కూడా మంగళవారం లోపు డిశ్చార్జి చేసే అవకాశముందన్నారు. దీనిపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అనంతరం పెద్దనాపల్లి అవంతి పరిశ్రమను సందర్శించారు. అవంతి సీఫుడ్స్ పరిశ్రమ, క్యాంటీన్‌ను డీఎంహెచ్‌వో, అధికారులు పరిశీలించారు. సుమారు 1000 మంది వరకు రోజూ క్యాంటీన్‌లో ఆహారం తింటారని తెలిసిందన్నారు. తాగునీరు పైప్ లైన్‌కు సంబంధించి లీకేజీ గుర్తించినట్టు తెలిపారు. తాగునీరు తరచూ అంతా వెళ్లి నల్లా లోపల ఉన్నాయని, వీటిపై పరిశ్రమకు నోటీసులు అందజేస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు తహశీల్దార్, వైద్యులకు తెలపాల్సి ఉందన్నారు. డీఎంహెచ్‌వో వెంట అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, వైద్యాధికారి శ్రీలక్ష్మి, టి.వీరన్న ఉన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బస్వా ప్రసాద్, పైలా కనకరావు కలిసి వివరాలు తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాద రహిత సురక్షిత
దేశం కోసం ఐక్యమవుదాం

ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్



రాజమహేంద్రవరంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీజీ మాదిరెడ్డి ప్రతాప్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అగ్ని ప్రమాదరహిత సురక్షిత భారతదేశం కోసం ఐక్యమవుదామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట అగ్నిమాపక సేవల కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాలను ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకూ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం రాష్ట్రప్రభుత్వంగా 160 అగ్నిమాపక వాహనాలను మంజూరు చేసిందన్నారు. తూర్పుగోదావరిలో రాజమహేంద్రవరం రూరల్, దేవరపల్లిలో మోడల్ ఫైర్ స్టేషన్లు రానున్నాయని ఆయన తెలిపారు. అగ్నిమాపక సేవల శాఖ ప్రాంతీయ అధికారి ఇ.స్వామి మాట్లాడుతూ కొత్త అగ్నిమాపక కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.250కోట్లు కేటాయింపు చేయగా.. తొలి విడతగా రూ.153కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. గత ఆర్థిక ఏడాదిలో రీజియన్ పరిధిలో 2021 నుంచి మొత్తం 14,732 ఫైర్ కాల్స్ వచ్చాయన్నారు. రూ.550 కోట్ల ఆస్తినష్టం జరగ్గా, రూ.1,335 కోట్ల ఆస్తిని బుగ్గిపాలు కాకుండా కాపాడగలిగామని వివరించారు. అలాగే 410 మంది ప్రాణాలు కోల్పోగా 601 మందిని రక్షించామని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ ఫైర్ ఆఫీసర్ నేహాల్ మార్టిన్ లూథర్ కింగ్, ఏడీఎఫ్‌వో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పంట కాలువలను ఆక్రమిస్తే
కేసులు నమోదు చేస్తాం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరిక

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైనా పంట కాలువలను ఆక్రమిస్తే, ఆక్రమించిన అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గండేపల్లి మండలం నాయకంపల్లి వద్ద మల్లిపూడి చాగల్నాడు కాల్వను 500మీటర్ల పొడవున, 10మీటర్ల వెడల్పున పూడ్చి పంట పొలంగా మార్చుకుని దిగువన 8గ్రామాల్లోని 5వేల ఎకరాలకు నీటి సరఫరాకు అవరోధం కల్పించిన బిక్కిన సూర్యనారాయణ చౌదరి అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాయకంపల్లి వెంకటాపురం, కోట పాడు, దొడ్డిగుంట, సింగరపల్లి, మల్లిపూడి గ్రామాల రైతుల ఫిర్యాదు ఆధారంగా చాగల్నాడు కాల్వను ఆక్రమణ పంటపొలంగా మార్చుకున్న బిక్కిన సూర్యనారాయణ చౌదరిపై పెద్దాపురం ఆర్డీవో శ్రీమణి గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ బుక్ ఫైల్ చేశారు.

శివకోడు జాతీయ రహదారిపై
స్కూటర్ దగ్ధం

రాజోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు 216 జాతీయ రహదారిపై సోమవారం షార్ట్ సర్క్యూట్ వల్ల స్కూటర్ దగ్ధమైందని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. మామిడికుదురు మండలం నగరం నుంచి కొల్లి మాధవి కూతురితో మలికిపురం మండలం మేడిచర్లపాలెంకి సుజికీ యాక్సెస్ స్కూటర్‌పై వెళ్తుండగా శివకోడు జాతీయ రహదారిపై చింతలపల్లి బస్టాప్ వద్దకు వచ్చేసరికి స్కూటరుపై ముందు నిలుచున్న కూతురు కాలు కాలుతున్నట్టు చెప్పడంతో ఆగి చూసేసరికి ఒక్కసారిగా స్కూటర్ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైంది. వెంటనే స్థానికులు రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎస్ఐ రాజేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



స్కూటర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న స్థానికులు

వ్యక్తిని గాయపర్చిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు సావరంలో మట్టి విక్రయానికి ఇంటి ముందు ఇసుకగుట్ట వేశారు. దారిలో అడ్డంగా ఉందని అందరూ జారిపడుతున్నారని గ్రామానికి చెందిన ఆకుల మురళి అడిగారు. దీంతో విశ్వనాధం, ఆతడి కుమారుడు రాజశేఖర్‌లు మురళిని కొట్టి గాయపర్చారు. గాయపడిన మురళి చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు మురళి ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం సత్యనారాయణ తెలిపారు.

ఎస్ఐ కుటుంబసభ్యులకు హెల్త్ బాగోలేదంటూ..

కొత్త తరహా సైబర్ మోసాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాళ్లు కొత్త తరహా మోసాలకు దిగుతున్నారు. ఎస్ఐ కుటుంబసభ్యులకు ఆరోగ్యం బాగోలేదు. డబ్బులు అత్యవసరం ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపండి అంటూ వారి నుంచి పలువురికి ఫోన్లు వస్తున్నాయి. కొందరు ఇది నిజమని నమ్మి వారికి డబ్బులు పంపుతున్నారు. ఇటువంటి సంఘటనలు ఇటీవల అధికం కావడంతో ఈ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. ఈ కాల్స్‌ను నమ్మవద్దని, ఎటువంటి సొమ్ములు ట్రాన్స్‌ఫర్ చేయవద్దని తెలిపారు. ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే సమీపంలో పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

సముద్ర తీర ప్రాంతంలో మరింత గస్తీ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో గస్తీని మరింత పెంచుతామని కోస్టల్ సెక్యూరిటీ ఏఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు పేర్కొన్నారు. వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్ సందర్శనలో భాగంగా సోమవారం ఆయన ఎన్టీఆర్ బీచ్‌ను పరిశీలించారు. మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, రైటర్ రమేష్ పాల్గొన్నారు.


కరపలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం


కాకినాడలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు


టీడీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలో జ్యోతుల నవీన్

ఘనంగా అంబేడ్కర్ జయంతి

కాకినాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ చిలుకోటి కూర్మయ్య రచించిన 'అంబేడ్కర్‌పై అపోహల సృష్టి.. వాటికి సమాధానా లు' పుస్తకాన్ని కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం ఆవిష్కరించారు. జగన్నాథపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో చదువుతూ ఇంటర్‌లో 956 మార్కులు సాధించిన కె.రాజేశ్వరి, 917 మా ర్కులు సాధించిన సీహెచ్ దేవిలను సత్కరించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ జి.శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, వివిధ ప్రజా, ఉద్యమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరపలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పూలమాల వేసి భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కరప మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కూటమి నేతలు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ బొండా సూర్యారావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పంతం సందీప్, కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, చొల్లంగి వేణుగోపాలరావు, దేవు వెంకటేశ్వరరావు, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, ముద్రగడ రమేష్, రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి మాచరరావు, తుమ్మలపల్లి గోవిందరాజులు, పోలిశెట్టి తాతీ లు, దూడల నారాయుడు, మెండు గోవిందు, మోకన అశోక్, జెల్లా శివకుమార్ పాల్గొన్నారు. పెనుగుదురులో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు నివాళులర్పించారు. కరప ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ శ్రీలక్ష్మిసత్తిబాబు, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఏవో బీఎల్ నరసింహం, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, సిబ్బంది సుబ్రహ్మణ్యం, కార్తీక్, భాస్కర్ పాల్గొన్నారు.

కాజులూరు మండలం చేదువాడ, కాజులూరు, కుయ్యేరు, తాడిపల్లి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కాజులూరు అంబేడ్కర్ భవన్‌లో డాక్టర్ భీమరావు రాంజీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వంద మంది పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. జనసేన రామచంద్రపురం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఉపాసన, కోలుగుమాటి నరసింహమూర్తి, కూటమి పార్టీల నాయకులు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): గొడారిగుంటలో మాజీ కార్పొ రేటర్ సీకోటి అప్పలకొండ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేదలకు చీరలు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్, నాయకులు లూటుకుర్తి మోహన్, బచ్చల కామేశ్వరరావు, బంగారు సత్తిబాబు, పలివెల రవి అనంతకుమార్, బలసాడి రంగారావు, వాసంశెట్టి చిట్టప్ప, సీకోటి రాజు, సామంతుల నాగేంద్రకుమార్, సీకోటి చక్రం, దార చిన్న, బళ్ల కుమార్, నాని, దుర్గ పాల్గొన్నారు. జగన్నాథపురం కుంతీదేవిపేటలో అంబేడ్కర్ జయంతిలో ఎమ్మెల్యే కొండబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ హోంలో జరిగిన వేడుకలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, కోశాధికారి వై.పద్మమీనాక్షి, కాకినాడ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అరదాడి సత్తిరాజు, రామకృష్ణ, మహిళా విభాగం సహ చైర్‌పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు. ఇంద్రపా లెం వంతెన వద్ద గల అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు నివాళులర్పించారు. కాకినాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, జిల్లా నాయకులు మట్ట ప్రసాద్, నక్కా సత్యనారాయణ, శేరు వీరబాబు, బత్తుల లలిత తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రైతుబజార్ వద్ద జగజ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే కొండబాబు ఆవిష్కరించారు. బీజేపీ నేతలు వేటుకూరి సూర్యనారాయణరాజు, గట్టి సత్యనారాయణ, ముత్తా నవీన్ కృష్ణ, టీడీపీ నేతలు మల్లిపూడి వీరు, పోలిపల్లి జగన్, బీసీ నేతలు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు, కుండల సాయికుమార్, సేవా సంఘం అధ్యక్షుడు ఏడిద శ్రీను, ఉపాధ్యక్షులు డోకుబుర్ర వరప్రసాద్, పోల్నాటి రాజేష్, కార్యదర్శి ఏడిద కృష్ణ, సంఘ ప్రతినిధులు ఎండగండ ఇస్సాక్, కాకాడ శివకుమార్, కోట్ల రామకృష్ణ, నరుకుర్తి శ్రీనివాసరావు, రాచర్ల చిన్ని, పోల్నాటి రాము, ఏడిద అప్పన్నదొర పాల్గొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పూలమాల వేశారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, జిల్లా నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, కొండా వినాయక్, భూపాలపట్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారం, ఇందిరానగర్, రథాలపేట, కత్తులగూడెం, భీమ్‌నగర్, మంగాయమ్మరావుపేట తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్ జయంతి ఘనంగా జరిగింది. అంబేడ్కర్ విగ్రహాలకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, వైసీపీ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్, బీజేపీ. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం విశ్వనాథం పూలమాలలు వేశారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. శ్రీభీమ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిని, నిర్వాహకులను అభినందించారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటల్లో అంబేడ్కర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, మొగలి రామ్మూర్తి, జనసేన, వైసీపీ నాయకులు నివాళులర్పించారు. గాంధీనగర్‌లోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, గాజువాక విశ్రాంత మునిసిపల్ కమిషనర్ వెన్నపు చక్రధరరావు, కొమ్ము సత్యనారాయణ, చోడపునీడి పుల్లపురాజు పూలమాలలు వేశారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు, దుర్గాడ, తాటిపర్తి, ఏకే మల్లవరం, చెందుర్తి, కొడవలి, కేహెచ్‌పేటల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. తాటిపర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ జడ్పీటీసీ మడికి సన్యాసిరావు పూలమాలలు వేసి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చేబ్రోలులో అంబేడ్కర్ విగ్రహానికి గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం భోగాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, దళిత సంఘాల నేతలు నివాళులర్పించారు. విరవాడ పీహెచ్‌సీ కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి కూరాకుల సింహాచలం, అంబేడ్కర్ యువజన సంఘం, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు నివాళులర్పించారు. కట్టమూరులో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, ఆర్డీవో శ్రీరమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, దుర్గామోహనరావు, తూతిక రాజు, బేదంపూడి సత్తిబాబు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దారపురెడ్డి క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అందరివాడని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. దళితవాడల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి పూలమాలలు వేశారు. నీలమ్మ చెరువు, బలుసులపేట రోడ్డు, బ్రౌన్‌పేట, బలుసులపేట ఇందిరానగర్, కుమ్మరి వీధుల్లో జరిగిన కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి కమిషనరు శ్రీవిద్య, చైర్‌పర్సన్ జి.అరుణ నివాళులర్పించారు. అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. హుస్సేన్‌పురం దళితవాడలో టీడీ పీ నాయకులు చల్లా బుజ్జి, తలారి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోట అప్పారావు, కోట సురేష్. దళిత నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కేఎం బాషా, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్‌రావు, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, జైభీమ్ సంఘ నాయకులు టి.బండారు, ఎస్.ప్రసాద్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలుర వసతిగృహానికి రూ.50వేలు విలువైన వాటర్ ఫ్రిజ్, సీలింగ్ ఫ్యాన్లు అందించాయి. కాకినాడ రీజనల్ మేనేజర్ తపోదన్, ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు కె.యశ్వంత్, ప్రతీక్, సందీప్, భరత్ పాల్గొన్నారు. ఇంద్రపాలెం కూడలి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. తుమ్మలపల్లి నారాయణరావు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, కర్రి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ క్రైం (ఆంధ్రజ్యోతి): అణగారిన ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ పూలమాల వేశారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఐ.ప్రభాకర్, డెమో సీహెచ్ ఎస్వీడీవీ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. జీజీహెచ్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి నివాళులర్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పి.శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజకుమారి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. రంగరాయ వైద్య కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణుడు డాక్టర్ కాకర రామ్‌స్వరూప్ జవహర్‌ను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పి.శ్రీనివాసన్, ఫొరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురంలో జైభీమ్, జనసేన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు పాంద్రంకి రాజు, శిరంగు శ్రీనివాసరావు, మాదారపు తాతాజీ, వైస్ ఎంపీపీ బి.వీరేష పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): వాకతిప్ప-యండపల్లి కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వర్మ, జేఏసీ నాయకులు పండు అశోక్ కుమార్, బత్తిన శామ్యూల్ నివాళులర్పించారు. వాకతిప్పకు చెందిన బత్తుల రాంజీకుమార్ 134 కొత్త పది రూపాయలతో ప్రత్యేకంగా తయారు చేయించిన దండను అంబేడ్కర్ విగ్రహం మెడలో వేశారు. కొత్తపల్లి దళితపేట సెంటర్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గవర భవానీనాగేశ్వరరావు, జనసేన నాయకులు రావు అక్షయ్, వైసీపీ నాయకులు రావు చిన్నారావు పాల్గొన్నారు. యండపల్లి, జొన్నలగరువు గ్రామాల ఆధ్వర్యంలో జైభీమ్ యూత్, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు గొడుగు సత్యనారాయణ, శీలం అప్పలరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సహపంక్తి భోజనాలు చేశారు.


కాజులూరులో మహిళలకు వస్త్రాలు అందజేస్తున్న మంత్రి సుభాష్



సామర్లకోటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



కాకినాడ రూరల్ తిమ్మాపురంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నానాజీ


కాకినాడ జీజీహెచ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న సూపరింటెండెంట్ లావణ్య


పెద్దాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు


కొత్తపల్లి మండలం వాకతిప్పలో జయంతి వేడుకలో మాజీ ఎమ్మెల్యే వర్మ, జేఏసీ చైర్మన్ అశోక్‌కుమార్


పిఠాపురంలో అంబేడ్కర్ జయంతి వేడుకలో జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు


గొల్లప్రోలులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జనసేన నాయకులు


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న జడ్పీటీసీ నాగలోవరాజు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

బాలుర వసతి గృహం పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీచెరువు సెంటరు వద్ద సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాల బాలుర వసతిగృహాన్ని కలెక్టర్ షాన్ మోహన్, సాంఘిక, సంక్షేమం, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వసతిగృహంలో రూ.29.75లక్షలతో చేపట్టిన ఆధునికీకరణ పనులను, రూ.95లక్షలతో నిర్మించిన కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ జి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ ఆర్.జయరావు, డీఈ కె.వెంకటరాజు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ గొప్ప ఆర్థికవేత్త'

జేఎన్టీయూకే, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప ఆర్థికవేత్త, సామాజిక సంస్కర్త అని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వర్సిటీలో ప్రాంగణంలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి వీసీ ప్రసాద్, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ అధికారి ఎం.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


శృంగారవల్లభస్వామికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

ముగిసిన కల్యాణోత్సవాలు

పెద్దాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శృంగార వల్లభస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను సుగంధ పరిమళ పుష్పాలు, పత్రాలతో అలంకరించి శ్రీపుష్పయాగం నిర్వహించారు. ఈవో వడ్డి శ్రీనివాసరావు, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. నృత్యాంజలి అకాడమీ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. నటరాజ రామకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ గజరావు సీతారామస్వామి స్మారకార్థం నిర్వహించిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు తెలంగాణ ఐపీఎస్ అధికారి డాక్టర్ గజరావు భూపాల్ తదితరులు జ్ఞాపికలు అందజేశారు.

జనసేలో బయటపడ్డ వర్గపోరు

పిఠాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జనసేనలో అంతర్గతంగా ఉన్న వర్గపోరు బయటపడింది. జనసేన పట్టణ అధ్యక్ష పదవి కోసం ఇద్దరు నాయకులు కొంత కాలంగా పోటీపడుతున్నారు. వారి మధ్య ఉన్న విభేదాలు సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బయటపడ్డాయి. ఇందిరానగర్, రథాలపేట వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసేందుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు వచ్చిన సమయంలో రెండు వర్గాలు వాగ్వాదానికి దిగాయి. రెండుచోట్లా నాయకులు కేకలు వేసుకోవడంతో వారికి నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఒకానొక దశలో బాహాబాహీకి సిద్ధపడ్డారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న కొందరు విలేకరులపై జనసేన నేతలు దురుసుగా ప్రవర్తించారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

కోటనందూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం ఎల్‌డిపేట ఎంపీపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థి ఏలేటి కృపానందం సోమవారం సుమారు రూ.20వేలు విలువ చేసే టీవీని ప్రధానోపాధ్యాయుడు పంచాడ అర్జునరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అంబేడ్కర్ రాజ్యాంగంతో అందరికీ న్యాయం

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి



రంపచోడవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

రంపచోడవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, సబ్ డీఎఫ్‌వో అనుష, ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ బ్రిటీష్‌పాలన అనంతరం దేశంలో అన్నివర్గాల వారికి న్యాయం చేసేలా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడు సమానంగా చదువుకునే హక్కు కల్పించారన్నారు. తొలుత ఐటీడీఏ కార్యాలయం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సేవా సంఘ నాయకులు ర్యాలీ నిర్వహించి



కూనవరంలో అంబేడ్కర్‌కు పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

ప్రధాన కూడలిలో మానవహారం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.రామకృష్ణ, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, దళిత సేవా సంఘం నాయకులు వై.వి.రమణయ్య, డి.సింహాద్రి, మాదే రామచంద్రరావు, గడ్డం శ్రీరాములు, బి.ప్రసాద్, టేకూరి సుధాకర్, జయరాజ్, చిన్నబ్బాయి, పండా రామకృష్ణ, అడబాల బాపిరాజు, పి.సురేష్, వై.ఎస్‌సీహెచ్ బోస్, ఎం. వీరబాబు, జాన్, సువర్ణకుమార్, సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

చింతూరు, (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి వేడుకలు చింతూరులో ఘనంగా జరిగాయి. ఐటీడీఏ కార్యాలయంలో పీవో అపూర్వ భరత్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో, చింతూరు సెంటర్‌లో దళిత కుంటుబ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



మోతుగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జరిగాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు, సంఘ నాయకులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో ఏపీఎస్‌బీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్లాంట్‌మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, డీఈటీ వరప్రసాద్, ఏఈ నరసింహ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చేసిన పోరాటం ప్రతి తరానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈసందర్భంగా నిరుపేదలకు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందించారు. ఈకార్యక్రమానికి లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో ఉద్యోగస్తులు, కాంట్రాక్ట్ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంపచోడవరం, (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ 134వ జయంతిని సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ ఇంజనీర్ చైతన్య అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో ఎస్‌వో టి.మార్తమ్మ, సీనియర్ అసిస్టెంట్లు పి.వెంకటేశ్వరరావు, కె.రాజారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పల్లాల లక్ష్మిరెడ్డి, హార్టికల్చర్ సబ్ అసిస్టెంట్లు భీమన్న, శోభన్‌బాబు, శివ, జె.విల్సన్, చెదల సోమిరెడ్డి, కె.రాంబాబు, నాగేశ్వరరావు, సన్యాసిరెడ్డి, విశ్వరెడ్డి పాల్గొన్నారు

వీఆర్‌పురం, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు వీఆర్‌పురం బీసీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. జేకే సిటీ చైర్మన్, టీడీపీ మండల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తుల అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ముత్యాల రామారావు



చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్

మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీరక సూర్యప్రకాష్ రావు, బొర్ర నరేష్‌కుమార్, ఆచంటి శ్రీను, బొర్ర నరసింహరావు, బొర్ర ఆది, ఎస్‌డీ సర్వరాజు పాల్గొన్నారు. రేఖపల్లి సీపీఎం కార్యాలయం, రేఖపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అడ్డతీగల, (ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అడ్డతీగల మెయిన్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకురాలు స్వప్న కుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో, సచివాలయాలు, ప్రభుత్వ



దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందుకూరుపేట తెలుగుదేశం కార్యాలయం వద్ద కూటమి నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు దారపు రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. టేకులబోరులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాలతో ఎందరో బడుగు, బలహీన వర్గాల వారు ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో నోముల రామారావు, గణేష్, వెంకన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు, మాలమహానాడు నాయకులు తదితరులు ఉన్నారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో సోమవారం బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 136వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎంపీపీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎస్ఐ రామకృష్ణ, ఆదివాసీ నాయకుడు పల్లాల లింగారెడ్డి, ఉపాధ్యాయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, లండా రాజబాబు, పుడిగి సత్యనారాయణ, లక్ష్మణరెడ్డి, జి.సత్యనారాయణ, శివరామకృష్ణ, పాస్టర్ గాబ్రియేలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్



వై.రామవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆధ్వర్యంలో, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే పలు ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో వేడుకలు జరిగాయి.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఇతరులు



మురారిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ



ప్రతిపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

జగ్గంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానమే కూటమి ప్రజాప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా జగ్గంపేట అంబేడ్కర్ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంద్రశేఖర్ పర్యవేక్షణలో సోమవారం వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని జగ్గంపేట సెంటర్లో ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, బచ్చల సుర్, సాంబత్తుల రాజేష్, మురారి రవికుమార్, తుమ్మల కిషోర్, ఎలగపల్లి ఎర్నస్ట్ రాజు, పడాల చంటిబాబు, జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గండేపల్లి: అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరిగాయి. మురారిలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని టీడీపీ నేత జాస్తి వసంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. అలాగే మురారి, మల్లేపల్లి, ఉప్పలపాడులో జరిగిన వేడుకలకు జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, గురజాల వెంకన్నదొర, సుంకవిల్లి రాజు, గద్దే అబ్బన్న, దారా ఏసురత్నం, సుంకవిల్లి సత్యనారాయణ, తుమ్మలపల్లి సాయిగుణశేఖర్, మేడిబోయిన శ్రీను, వెంకన్నబాబు, రామకుర్తి నరసింహం, బలిరెడ్డి గంగరాజు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో అంబేడ్కర్ 134 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. కళామందిర్ సెంటర్ లోని అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, స్థానిక సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వెంకటరత్నం, ఎంపీపీ గోళ్ళకాంతి సుధాకర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను, బీజేపీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, ఊటా వీరబాబు, నానిపల్లి శ్రీనివాస్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

శంఖవరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నెల్లిపూడి, వజ్రకూటం, కత్తిపూడి, తదితర గ్రామాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

రౌతులపూడి: రౌతులపూడిలో మార్కెట్ సెంటర్ నందు జైభీమ్‌యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించగా ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, అప్పారావు దంపతులు నివాళులర్పించారు. గ్రామ వీధుల్లో యువత అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ఎస్సీపేట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి, వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ గిరిబాబు పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ముక్కొల్లు ఎస్సీ పేటలో అంబేడ్కర్ విగ్రహానికి ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు పూలమాలలు వేశారు. తామరాడలో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తునిరూరల్: తుని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో కలిసి అంబేడ్కర్‌కు టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ నివాళులర్పించారు. తేటగుంటలో జరిగిన వేడుకలను ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, సుర్ల లోవరాజు, తామరాన రామకృష్ణ, తమరాన సత్యనారాయణ, చామంతి సత్తిబాబు, చిరంజీవ రాజు పాల్గొన్నారు. ఎస్.సురవరం గ్రామంలో జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు టీడీపీ సీనియర్ నేత చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

తొండంగి: తొండంగిలో ఎంపీడీవో రాజేశ్వ్రావు, ఆర్ఐ రాజారావులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెండపూడిలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాదనాల నూకరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఏవీ నగరంలో టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వరావు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

కోటనందూరు: కోటనందూరు బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు గాడారాజుబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెలగా వెంకట కృష్ణారావు, అంకంరెడ్డి బుల్లిబాబు, నెమ్మాది సత్యనారాయణ, అల్లంపల్లి నర్సింహమూర్తి అంకంరెడ్డి రమేష్, చింతకాయల రవికుమార్, పోతల సూరిబాబు, కడితి నూకరాజు, పాల్గొన్నారు.



శంఖవరంలో ...



రౌతులపూడిలో...



తుని టీడీపీ కార్యాలయంలో ...

బీభత్సం సృష్టించిన ఈదురుగాలులు

• నేలరాలిన మామిడి పంట, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు



జగ్గంపేట: ఈదురుగాలులకు రాలిపోయిన మామిడికాయలు



మల్లేపల్లిలో తడిసిపోయిన ధాన్యాన్ని ఎండబెడుతున్న రైతులు

జగ్గంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలంలో ఆదివారం రాత్రి వేసిన గాలికి మామిడితోటలకు అపారనష్టం వాటిల్లింది. జగ్గంపేట మండలం గోవిందపురం, మన్యవారిపాలెం, మల్లిశాల, రాజపూడి, కొత్తూరు, కొర్రపాలెం, గొల్లగుంట, పట్టం భావారం గ్రామాల్లో మామిడి కాయలు చాలావరకు రాలిపోవడంతో రైతులు అపారనష్టాన్ని ఎదుర్కొంటున్నారు.

గండేపల్లి: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి మామిడి కాయలు నేలరాలడంతో పాటు మురారి, గండేపల్లి, తదితర చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్‌కు అంతరాయం కలగడంతో మామిడి రైతులకు తీవ్ర నష్టాలు ఎదురయ్యాయి. రాత్రి బీభత్సం దాటికి పొద్దునే రైతులు పొలాలకు వెళ్లేసరికి ఎక్కడికక్కడ మామిడి పూర్తిగా రాలిపోవడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితిలో ఆవేదన చెందుతున్నారు. ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌కిషోర్ సిబ్బందిని అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టారు.

ప్రత్తిపాడు: ఈదురుగాలుల బీభత్సానికి మెట్ట ప్రాంతమామిడి రైతాంగం కుదేలయ్యారు. ఆదివారం రాత్రి గంటపాటు వీచిన ఈదురుగాలులకు మామిడికాయలు దారుణంగా నేలరాలాయి. పరిపక్వం చెందని మామిడికాయలు ఈదురుగాలులకు మామిడి నేలరాలడంతో మామిడి రైతుకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, బవురువాక, వెంకట్‌నగరం, చింతలూరు, పోతులూరు, వాకపల్లికి చెందిన వందలాది ఎకరాల మామిడి తోటలు ఈదురుగాలుల బీభత్సానికి దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న పెంకుటిల్లు

ఈదురుగాలులకు పెదశంకర్లపూడిలో రాసంశెట్టి కృష్ణ రాఘవమ్మకు చెందిన పెంకుటిల్లు దారుణంగా దెబ్బతింది. పై కప్పు పాక్షికంగా కూలింది. ఆ సమయంలో రాఘవమ్మ ఇంటి లోనే ఉండగా అదృష్టవశాత్తు ప్రమాద బారినపడకుండా సురక్షితంగా బయపడింది. ధర్మవరంలో విద్యుత్ స్తంభంతో పాటు రెండు వృక్షాలు కుప్పకూలాయి. దీంతో మండలంలోని పలు గ్రామాలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కిర్లంపూడి: ఆదివారం రాత్రి ఒక్కసారిగా ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. అకాల వర్షాలకు రైతన్నలు బెంబేలెత్తుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు ఆందోళన చెందుతున్నారు.



ధర్మవరంలో నేలవారిన మామిడికాయలు ఏరుతున్న రైతు



బాపిరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా బాపిరాజు

రంపచోడవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గ మార్కెటింగ్ యార్డు వైస్ చైర్మన్‌గా సలాది బాపిరాజు నియామకంపై టీడీపీ నాయకులు హర్షం తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మాజీ మండలాధ్యక్షుడు అడబాల బాపిరాజు ఆధ్వర్యంలో సలాది బాపిరాజును సన్మానించారు. పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటోజు సురేష్, కారం సింహాచలం, దిడ్డి జనార్ధన్, చోటు, రమణ, కంభం కొండబాబు, రౌతు వీరబాబు, ముర్ల బాలురెడ్డి, పండా బాబీ, ఈక నాగన్నదొర, గణపతి, సాదల సత్య, ఎస్.పెంటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వరసిద్ధి వినాయక కల్యాణాన్ని జరిపిస్తున్న దృశ్యం

వరసిద్ది వినాయక కల్యాణం

ఎటపాక, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గన్నవరం గ్రామంలోని వరసిద్ధి వినాయక ఆలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వినాయకుని కల్యాణం జరిపారు. ఉదయం గణపతి పూజ, ప్రధాన కలశ స్థాపన, ధ్వజా రోహణం, సూర్య హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు చీరాల వీరయ్య, కట్టా సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వారపు సంతలో పోలీసులు అవగాహన



వారపు సంతలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వై.రామవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వై.రామవరం వారపు సంతలో సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అడ్డతీల సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణలు గంజాయి నిర్మూలన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి విక్రయం, రవాణా నేరమని, వాటి జోలికి వెళ్లవద్దని యువతకు సూచించారు. యువతకు పోలీస్ శాఖ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐలు నాగరాజు, దినేష్, జగదీష్, సంధ్య, బషీరా భాగ్యశ్రీ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో దోమల నివారణ స్ప్రే

రంపచోడవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు రాకుండా మూడు టీమ్స్ ఐఆర్ఎస్ ఆపరేషన్ దోమల నివారణ మందు స్ప్రే చేస్తారని ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర తెలిపారు. మంగళవారం నరసాపురం, ఈతలపాడు, అకూరు పంచాయితీ పరిధిలోని గ్రామాలు, వాడపల్లి పంచాయతీలోని గ్రామాల్లో మందు స్ప్రే చేస్తారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అడ్డతీగల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల జడ్పీ పాఠశాల 1981-82 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం బూరుగుపూడి విమానాశ్రమం ఎదురుగా ఉన్న బేబీరావు గార్డెన్‌లో జరిగింది. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

టీడీపీ కుటుంబ సాధికార సారథుల నియామకంపై అవగాహన

జగ్గంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెల్లడించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట మండలం కుటుంబ సాధికార సారథుల నియామకంపై అవగాహన సదస్సు మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, పైడిపాల సూరిబాబు, బస్వాచినబాబు, ముండ్రు ఎర్రబాబు, రేఖ బుల్లిరాజు, సర్వసిద్ధ లక్ష్మణరావు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, వేములకొండ జోగారావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో సోమవారం టీడీపీ నాయకులు కందుల జెమిని, చిట్యాల బాబ్జీ ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. జగ్గంపేట టవర్ కాలనీలో టీడీపీ కార్యకర్త కోలా శివ తన తల్లిదండ్రులు కోల అప్పారావు అప్పలరాజు దంపతుల జ్ఞాపకార్థం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు.

ఆదిత్యలో నేపాల్, బంగ్లాదేశ్ న్యూ ఇయర్ వేడుకలు



వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రదర్శన

గండేపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ విభాగం ఆధ్వర్యంలో నేపాల్, బంగ్లాదేశ్ న్యూఇయర్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్నేషనల్ రిలేషన్ డైరెక్టర్ పరంజిత్ సింగ్, సీనియర్ మేనేజర్ ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ పవన్‌కుమార్ నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విలువలే లక్ష్యంగా బోధన ఉండాలి



కత్తిపూడిలో పాఠశాలను ప్రారంభిస్తున్న రామానుజ జీయర్‌స్వామి

త్రిదండి అహోబిల రామానుజ జీయరు స్వామిజీ

శంఖవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జ్ఞానం మాత్రమే కాకుండా నైతిక విలువలు బోధనే లక్ష్యంగా ప్రతీ విద్యాసంస్థ పనిచేయాలని త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం కత్తిపూడిలో నూతనంగా నిర్మాణం పూర్తిచేసుకున్న గురుకుల పాఠశాలను ఆయన ప్రారంభించారు. భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ, కీర్తి సుభాష్, గాబు గంగ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, పాఠశాల చైర్మన్ కిషోర్ ఉన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

జగ్గంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): : అగ్నిమాపక వారోత్సవాలను సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. అగ్నిప్రమాదంలో మరణించిన వారికి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్ర కార్యాయం వద్ద సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను గ్రామ సర్పంచ్ గుడాల విజలక్ష్మి వెంకట రత్నం, ఫైర్ ఇన్‌చార్జ్ అధికారి రతన్‌రాజు ప్రారంభించారు. ఎల్ఎఫ్ కేఎస్ఎన్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

తుని రూరల్: తునిలో అగ్నిమాపక వారోత్సవలు ప్రారంభించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు.

అంబేడ్కర్ జయంతి

ఏలేశ్వరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాత బస్టాండ్, శాంతినగర్ కాలనీ, అంబేడ్కర్ నగర్, క్వారీపేట, లింగంపర్తి, జె.అన్నవరం, తిరుమాలిలోని అంబేడ్కర్ విగ్రహాలకు టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జ్యోతుల పెదబాబు, వాగు రాజేష్, బీ. శ్రీనివాస్ పాల్గొన్నారు.